సాక్షి తిరుపతి

శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



అంతర్గత ప్రేరణే విజయ రహస్యం

అంతర్గత ప్రేరణే విజయానికి రహస్యమని వేలూరు జిల్లా అటవీశాఖాధికారి గురుస్వామి పిలుపునిచ్చారు. - 8లో



రెండు వాహనాల ఢీ

నాగలాపురం మండలంలో ఐషర్, తవేరా వాహనాలు ఢీకొని ఏడుగురికి గాయాలయ్యా యి. - 8లో



ఇసుక లారీల సీజ్

వరదయ్యపాళెం నుంచి తమిళనాడుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను శ్రీసిటీ పోలీసులు సీజ్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అసిస్టెంట్ టెక్నీషియన్–నెట్ వర్కింగ్ అండ్ స్టోరేజ్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 210 గంటల కాల వ్యవధి ఉన్న ఈ కోర్సుకు పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని, ఇతర వివరాలు 81435 76866, 99851 29995 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

పాలిటెక్నిక్ కళాశాలలో త్రీడీ ప్రింటింగ్‌పై వర్క్‌షాప్



శిక్షణ ఇస్తున్న ఐఎస్‌టీఈ స్టూడెంట్స్ చాప్టర్ ప్రతినిధి

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని మెకానికల్ విభాగంలో త్రీడీ ప్రింటింగ్‌పై ఒకరోజు వర్క్‌షాపును గురువారం నిర్వహించారు. ఈ వర్క్‌షాపులో విద్యార్థులకు త్రీడీ ప్రింటింగ్ పనిచేసే విధానం, వాటి విడిభాగాల అమరిక, త్రీడీ ప్రింటింగ్‌కి ఉపయోగించే సాఫ్ట్‌వేర్‌పై విద్యార్థులకు ఈ వర్క్‌షాపులో లైవ్ డెమో ద్వారా శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథ్‌రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి హెచ్.శైలజ, ఐఎస్‌టీఈ స్టూడెంట్స్ చాప్టర్ కోఆర్డినేటర్ ఎ.ధనుంజయులు, స్టూడెంట్స్ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

25న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 25వ తేదీన హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తిసన్నిధిలో ఉదయం 7 గంటల నుంచి ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించనున్నట్లు తెలిపారు.

స్విమ్స్‌లో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు ప్రారంభం



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభిస్తున్న స్విమ్స్ డైరెక్టర్, డీఎంహెచ్‌ఓ

తిరుపతి తుడా: స్విమ్స్ పద్మావతి హాస్పిటల్ గైనకాలజీ విభాగంలో రెండు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను గురువారం స్విమ్స్ డైరెక్టర్ కమ్ వీసీ డాక్టర్ ఆర్వీకుమార్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్విమ్స్ హాస్పిటల్ అభ్యర్థన మేరకు ప్రభుత్వం రెండు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లను అందించినట్లు తెలిపారు. ప్రత్యేక వాహనాల ద్వారా ఆస్పత్రుల్లో ప్రసవించే తల్లులకు ఆస్పత్రి నుంచి స్వగృహానికి చేర్చే సేవలను అందిస్తున్నామని తెలిపారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ స్విమ్స్‌లో నిత్యం అందుబాటులో ఉండేలా, 102కు కాల్ సెంటర్ ద్వారా సమన్వయం చేశామన్నారు. ప్రజలు అభ్యర్థించిన 30 నిమిషాలలోపు వాహనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీల్లో ప్రభుత్వ హాస్పిటల్స్ తరహాలోనే స్విమ్స్ పద్మావతి హాస్పిటల్‌లో ప్రతి కాన్పు ఉచితంగా చేస్తామన్నారు. మెడికల్ సూపరింటెండెంట్ రామ్, ఆర్‌ఎంఓ కోటిరెడ్డి, వైద్యులు మృదుల, ప్రవళ్లిక, ప్రభావతి, పీఆర్‌ఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: శ్రీవారి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 78,690 మంది స్వామివారిని దర్శించుకోగా 26,086 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.18 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టికెట్లు లేని వారికి 18 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

కొత్త కళాశాలలతోనే అవకాశం



రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలలు వస్తేనే విద్యార్థులకు అవకాశాలు వస్తాయి. దీన్ని దృష్టిలో ఉంచుకునే గత ప్రభుత్వం 17 కళాశాలలను ఏర్పాటు చేసింది. అందులో ఈ ఏడాది 5 కళాశాలలు అందుబాటులోకి వచ్చాయి. అయితే ఈ ప్రభుత్వం చర్యల కారణంగా సీట్లు రాకపోవడంతో నీట్‌లో మెరిట్ సాధించిన నా లాంటి విద్యార్థులు అవకాశాలను కోల్పోవాల్సి వచ్చింది. ప్రభుత్వం ఇకనైనా స్పందించి సీట్లు వచ్చేలా చర్యలు చేపట్టాలి.

–కె.జ్యోత్స్న, నీట్ విద్యార్థిని, తిరుపతి



విద్యార్థులకు న్యాయం చేయాలి



కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటుతో రాష్ట్రానికి అదనపు సీట్లు అందుబాటులోకి వచ్చి మరింత మంది విద్యార్థులు వైద్యవిద్య అభ్యసించడానికి అవకాశం ఉంటుంది. ఈ ఏడాది 5 కళాశాలలు అందుబాటులోకి వచ్చినా వసతులు ఇతరత్రా కారణాలతో సీట్లు వద్దని ఐఎంసీకి ఈ ప్రభుత్వం లేఖ రాయడంతో సీట్లు మంజూరు కాలేదు. దీంతో తమ లాంటి విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి మెడికల్ సీట్లు పెంపునకు చర్యలు తీసుకుని, విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలి.

–పి.తరుణ్‌కృష్ణ, నీట్ విద్యార్థి, తిరుపతి

తిరుపతి, చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చేసే బాధ్యత తాను తీసుకుంటున్నట్లు ఎన్నికల ప్రచార సభల్లో చంద్రబాబు గొప్పగా ప్రకటించుకున్నారు. అయితే ప్రాజెక్టుల అభివృద్ధికి సంబంధించి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. సూపర్ సిక్స్.. మీ జీవితాల్లో వెలుగులు ఫిక్స్.. ఇది మా హామీ. మెగా డీఎస్సీ.. నిరుద్యోగులకు సర్కారు కొలువు ఖాయం. ఇంటింటికీ ఓ ఉద్యోగం, ఉపాధి చూపకపోతే భృతి అందజేస్తాం. ప్రతి మహిళనూ లక్షాధికారిని చేస్తాం.. చేనేతకు చేయూత నిస్తాం.. మత్స్యకారులకు మేలు చేస్తాం.. ఒకటేమిటి అదీ, ఇదీ అన్నీ చేస్తామంటూ నాడు కూటమి బాస చేసింది. అంతవరకు సంబరమే.. అయితే గద్దెనెక్కి వందరోజులు పూర్తయినా ఒకటంటే ఒకే ఒక హామీ అమలుకు నోచుకుంది. మిగిలిన హామీలన్నీ మాయమయ్యాయి.



కుప్పానికి మీరిచ్చిన వరాలు గుర్తున్నాయా బాబూ?

2024 మార్చి 25న కుప్పం బహిరంగ సభలో చంద్రబాబు

- కుప్పానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయిస్తాం.
- ప్రతి మహిళకూ రెండు పాడి ఆవులు ఇస్తాం.
- ప్రతి మండలానికి ఒక పరిశ్రమ స్థాపిస్తాం.
- హంద్రీ నీవా కాలువ పూర్తి చేసి కుప్పానిని నీరు తెస్తాం.
- బెంగళూరు నుంచి కుప్పానికి గ్రీన్‌ఫీల్డ్ హైవే ఏర్పాటు చేస్తాం.
- కుప్పం నుంచి పలమనేరుకు ఫోర్‌లేన్ హైవే నిర్మాణం చేపడతాం.
- విమానాశ్రయం ఏర్పాటు చర్యలు తీసుకుంటాం.
- ప్రతి మండలానికి కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేస్తాం.
- ప్రతి మండలానికి కూరగాయల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసి విదేశాలకు కూరగాయలు ఎగుమతికి అవకాశం కల్పిస్తాం.
- కుప్పం పట్టణాన్ని శాటిలైట్ టౌన్ షిప్‌గా మార్చుతాం.
- నియోజవర్గంలోని 10 ప్రధాన దేవాలయాలు ప్రత్యేక అభివృద్ధి.
- కుప్పం మున్సిపాలిటీకి రూ.250 కోట్లు కేటాయించి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం.
- మేజర్ పంచాయతీకి రూ.2 కోట్లు, మైనర్ పంచాయతీ రూ.కోటి అధికంగా నిధులు కేటాయిస్తాం.
- కుప్పం ఆర్టీసీ డిపోను ఆదర్శ డిపోగా మారుస్తాం.

వంద రోజులుగా వంచన

హామీలు కోకొల్లలు.. అమలు ఒకే ఒకటి

- సూపర్ సిక్స్ పక్కనపెట్టారు.. ప్రతి మహిళకూ రెండు పాడి ఆవులేవి?
- కుప్పానికి ప్రత్యేక బడ్జెట్ లేదు.. మున్సిపాలిటీకి రూ.250 కోట్లు విదల్చలేదు
- కుప్పం– బెంగళూరు మధ్య గ్రీన్‌ఫీల్డ్ హైవే ఒట్టి మాటలే కదా బాబూ ?
- టమాట, కూరగాయల నిల్వకు ప్రతి మండలానికి ఓ కోల్డ్ స్టోరేజ్ ఊసేలేదు

సాక్షి ప్రతినిధి, తిరుపతి: అధికారం కోసం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ బాబు లెక్కలేనన్ని హామీలు ఇచ్చారు. ఎన్నికల ముందు ప్రజాగళం, వారాహి, యువగళం పేరుతో ముగ్గురు నేతలు ఊరూ వాడా తిరుగుతూ అలవికాని హామీలు గుప్పించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజులకే పలు హామీలను అమలు చేస్తామని బహిరంగంగా ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతి, చిత్తూరు జిల్లాలో ఒకే ఒక హామీ తప్ప మిగిలిన ఏ ఒక్క హామీ అమలు కాలేదు. ముఖ్యంగా మెగా డీఎస్సీని వంద రోజుల్లోనే తీసుకొచ్చి పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పిస్తామని గొప్పగా ప్రకటించుకున్నారు. ఇకపోతే సూపర్ సిక్స్ గురించి ఊరూ వాడా ప్రచారం చేశారు. అభ్యర్థులు అయితే 'నీకు రూ.15 వేలు, నీకు రూ.15 వేలు, నీకు రూ.18 వేలు' అంటూ ఇంటింటికీ వెళ్లి చెప్పారు. వంద రోజులు పూర్తయినా సూపర్ సిక్స్ ఊసేలేదు. మెగా డీఎస్సీ అంటారా.. కేవలం ప్రకటనకే తప్ప కార్యరూపం దాల్చిన దాఖలాలు లేవు. ఇలా చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ బాబు తిరుపతి, చిత్తూరు జిల్లాలో పర్యటించిన సందర్భంగా ఇచ్చిన హామీలు, అమలుపై సాక్షి ప్రత్యేక కథనం.

ముక్కంటి సాక్షిగా..

2024 మార్చి 30వ తేదీన చంద్రబాబు శ్రీకాళహస్తి, నాయుడుపేటలో ఎన్నికల ప్రచారంలో పాల్గొని, ప్రసంగించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే శ్రీకాళహస్తిలోని స్కిట్ కళాశాలని జేఎన్‌టీయూకి అప్పగించి, పూర్వవైభవం తీసుకొస్తా. తిరుపతి, శ్రీకాళహస్తి, కాణిపాకం ట్రై సిటీగా మార్చి పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతా. అయితే అటువంటి చర్యలేవీ కనిపించలేదు. నాయుడుపేట సభలో.. మత్స్యకారులకు చేపల వేటకు వెళ్లేందుకు వీలుగా డీజిల్, వలలు ఇవ్వటంతో పాటు తమిళనాడు, ఏపీ మత్స్యకారుల మధ్య తలెత్తుతున్న వివాదాలను పరిష్కరిస్తా. అటువంటి ప్రయత్నాలు చేస్తున్న దాఖలాలు లేవు.

వెంకటగిరిని చేనేత హబ్‌గా మారుస్తా..

2024 జనవరి 19వ తేదీన చంద్రబాబు వెంకటగిరి ఎన్నికల ప్రచార సభలో పాల్గొని ప్రసంగించారు. వెంకటగిరిని చేనేత హబ్‌గా మారుస్తా. చేనేతలకు మంచి భవిష్యత్తుని అందిస్తా. పేదరికం లేని సమాజాన్ని నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అయితే అటువంటి ప్రయత్నాలేవీ జరుగుతున్నట్లు కనిపించలేదు.

తెలుగుగంగ కాలువ సాగునీరేది?

2023 జూన్ 26న యువగళం పాదయాత్ర చిట్టమూరు మండలం అరవపాళేనికి చేరుకుంది. 1800 కి.మీ పూర్తి చేసుకున్న సందర్భంగా తెలుగుగంగ కాలువకు బ్రాంచ్ కెనాల్ ఏర్పాటు చేసి అన్ని గ్రామాలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

తిరుపతిలో చంద్రబాబు, పవన్ ఇలా..




2024 మే 7వ తేదీన తిరుపతిలో పర్యటించిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఏమన్నారంటే..

- తిరుమల పవిత్రతను కాపాడుతాం. ఆలయాల వార్షిక ఆదాయం ఆధారంగా అర్చకులకు రూ.5 వేల నుంచి రూ.15 వేలు వేతనం.
- పౌరోహిత్యాన్ని కులవృత్తిగా గుర్తించుతాం.
- బ్రాహ్మణ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేస్తాం.
- తిరుమల తిరుపతి దేవస్థానంతో పాటు అన్ని ఆలయాల పాలకమండలిలో బ్రాహ్మణులను ట్రస్టుబోర్డులు సభ్యులుగా నియమిస్తాం.

పుంగనూరులో..

2024 మే 7వ తేదీన పుంగనూరులో పర్యటించిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి, 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం.

- ఐటీ టవర్ ఏర్పాటుతో పాటు టెక్స్‌టైల్ పరిశ్రమలు నెలకొల్పుతాను.
- ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించి, విదేశీ విద్యను ప్రోత్సహిస్తాను.
- మసీదులకు ప్రతినెలా రూ.5వేలు ఆర్థిక సాయం అందిస్తా.

చిత్తూరులో చంద్రబాబు..



2024, మే 11 వతేదీన చిత్తూరు నగరంలోని మురకంబట్టు కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో.. జిల్లా కేంద్రమైన చిత్తూరులో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి విద్యాహబ్‌గా మారుస్తాను.

- చిత్తూరులోనే ఐటీ టవర్ ఏర్పాటు, పలు పరిశ్రమలు తీసుకొస్తా.
- జిల్లాలోని ప్రతీ ఎకరాకు నీళ్లిచ్చి, చిత్తూరు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తా.

బంగారుపాళెంలో డయాలసిస్ కేంద్రం



బంగారుపాళెంలో శుక్రవారం ప్రారంభం కానున్న డయాలసిస్ కేంద్రం

లోకేష్ బాబు యువగళం పాదయాత్ర బంగారుపాళెంలో చేరుకున్న సందర్భంగా వందరోజులు పూర్తి కావడంతో అక్కడ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తామని ఓ శిలాఫలకాన్ని ఆవిష్కరించి, హామీ ఇచ్చారు. నాడు ఇచ్చిన హామీని నేడు మంత్రి హోదాలో లోకేష్ బాబు ప్రారంభించనున్నారు.

2023 జనవరి 27వ తేదీన యువగళం పాదయాత్రలో లోకేష్..



- ప్రతి ఏటా 6,500 పోలీసు కానిస్టేబుల్ పోస్టులు భర్తీ.
- తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఎటువంటి కండీషన్లు లేకుండా రేషన్‌కార్డు, పెన్షన్లు.
- యూత్ మేనిఫెస్టో తీసుకువస్తాం. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే డీఎస్సీ పెట్టి, ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. ఉచితంగా డ్రిప్ ఇరిగేషన్ తీసుకొస్తామన్నారు. ఇంకా పలు హామీలు ఇచ్చారు.

వంద పడకల ఆస్పత్రేదీ?

2023 ఏప్రిల్ 20న సత్యవేడు ఎన్నికల బహిరంగ సభలో చంద్రబాబు పలు హామీలు ఇచ్చారు.

- సత్యవేడులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వందపడకల ఆస్పత్రిగా అభివృద్ధిచేస్తా.
- నియోజకవర్గ కేంద్రంలో ఆర్డీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తా
- సత్యవేడు, వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా అభివృద్ధి చేస్తా
- దాసుకుప్పం, సత్యవేడుకు బైపాస్ రోడ్డు నిర్మిస్తా

సీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తా

2024 మార్చి 27లో పలమనేరు ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు హామీలు

- రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చే బాధ్యతను నేను తీసుకుంటున్నా.
- సూపర్ సిక్స్‌తో పాటు 50 ఏళ్లకే పింఛను ఇస్తాను.

ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఎక్కడ?

2023 మార్చి ఒకటో తేదీన లోకేష్ బాబు యువగళం పాదయాత్ర పాకాల మండలం నేంద్రగుంటలో 400 కి.మీ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా లోకేష్ బాబు అధికారంలోకి వచ్చిన వెంటనే నేంద్రగుంటలో పది పడకల సామర్థ్యంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు ఆ ఊసేలేదు.

తాగునీళ్లెప్పడిస్తారు?

2023 ఫిబ్రవరి 19న యువగళం పాదయాత్ర 300 కి.మీ పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురం వద్ద శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల ఉన్న 13 గ్రామాలకు రక్షిత మంచినీటిని పథకం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు.



తొండమాన్‌పురం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం

చిత్తూరు యువగళం పాదయాత్రలో..

2023, ఫిబ్రవరి 6 : టీడీపీ ఎస్సీ విభాగంలో ముఖాముఖి నిర్వహించిన కార్యక్రమంలో.. అధికారంలోకి వస్తే ఎస్సీ సబ్‌ప్లాన్‌ను కొనసాగిస్తాం. ఎస్సీలకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు.

ఫిబ్రవరి 7 : చిత్తూరులో నిర్వహించిన యువగళం బహిరంగ సభలో.. చిత్తూరులో యూనివర్సిటీ, ఎలక్ట్రానిక్ మానుఫాక్చర్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తాం. ప్రజల దాహార్తిని తీర్చడానికి శాశ్వత తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం

డిగ్రీ కళాశాల ఎక్కడ లోకేష్ గారూ..

లోకేష్ బాబు యువగళం పాదయాత్ర 2023 ఫిబ్రవరి 11న గంగాధరనెల్లూరు నియోజక వర్గం కార్వేటినగరం మండలం కత్తిరిపల్లి వద్ద 200 కి.మీ పూర్తి అయ్యింది. ఈ సందర్భంగా లోకేష్ అక్కడ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో గంగాధరనెల్లూరులో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వంద రోజులు పూర్తి అయినా ఎలాంటి చర్యలు లేవు. దీంతో విద్యార్థులు చిత్తూరు, పుత్తూరుకు వెళ్లాల్సి వస్తోంది.



కార్వేటినగరం కత్తెరపల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకం

హ్యాండ్ లూమ్‌కి హ్యాండిస్తారా?

2023 జూన్ 21న డక్కిలి మండల కేంద్రానికి చేరుకున్న యువగళం పాదయాత్ర 1700 కి.మీ పూర్తి చేసుకుంది. వెంకటగిరి చేనేతకు ప్రసిద్ధి కావడంతో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ ప్రాంతంలో హ్యాండ్ లూమ్ టెక్స్‌టైల్ పార్కు స్థాపిస్తామని లోకేష్ బాబు హామీ ఇచ్చారు. ఆ దిశగా ప్రభుత్వ ప్రయత్నాలేవీ కనిపించలేదు.



డక్కిలి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

ప్రైవేటుపరం చేస్తే ప్రాణత్యాగాలకైనా సిద్ధం



ర్యాలీ చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

- పేద విద్యార్థుల కలను అడ్డుకుంటే ఉద్యమమే
- తిరుపతి కేంద్రంగా ర్యాలీ. మానవహారాలతో కదం తొక్కిన విద్యార్థిలోకం

తిరుపతి సిటీ: వైద్యవిద్యను ప్రైవేటుపరం చేస్తే ఊరుకునేది లేదని, ప్రాణత్యాగాలకైనా సిద్ధపడతామని విద్యార్థి సంఘాల నేతలు చంద్రబాబు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం తిరుపతి కేంద్రంగా జిల్లాలోని సుమారు 15 విద్యార్థి సంఘాల నేతలు టౌన్‌క్లబ్ సర్కిల్ వద్ద పెద్ద ఎత్తున ర్యాలీలు, మానవహారాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల కలను అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్, ప్రవీణ్, వైఎస్సార్ సీపీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఓబుల్ రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఆది, ఆమ్‌ఆద్మీ నేత నగేష్, పలు విద్యార్థి సంఘాల నాయకులు చిన్న, వినయ్, మహేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొన్న బైక్

యువకుడి మృతి


రవి కుమార్(ఫైల్)

చంద్రగిరి: ఆగి ఉన్న ట్యాంకర్‌ను బైక్ ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిలోని మామండూరు సమీపంలో గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మామండూరు దళితవాడకు చెందిన మునస్వామి కుమారుడు రవికుమార్(32) చంద్రగిరిలోని ఓ సినిమా థియేటర్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకుని వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో తిరుపతికి వెళ్లాడు. పనులు ముగించుకుని గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. మామండూరు వద్ద వస్తున్న క్రమంలో సర్వీసు రోడ్డుపై హెరిటేజ్ ఫ్యాక్టరీకి వెళ్లే క్రమంలో ఆగి ఉన్న ట్యాంకర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రవికుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. సర్వీసు రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా ఆపిన ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య విద్యార్థులకు వెన్నుపోటు



ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు కట్టబెట్టే కుట్రకు కూటమి ప్రభుత్వం తెరతీస్తోంది. వైద్య విద్యార్థులకు ఇది వెన్నుపోటు నిర్ణయం. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఒకేసారి 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు చొరవ చూపారు. అందులో 5 పూర్తి చేసి ఎంతో మంది విద్యార్థులకు వైద్యవిద్య కలను నెరవేర్చారు. ఆ దిశగా నా కుమారుడు సుశాంత్ నీట్ సీటు కోసం లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాడు. రాష్ట్రంలో గత ప్రభుత్వంలో వచ్చిన 17 మెడికల్ కాలేజీలు పూర్తయితే నా కుమారుడికి ఉచితంగా వైద్య సీటు వస్తుందని ఆశపడ్డాను. అయితే మా ఆశలను అడియాశలు చేస్తూ కూటమి ప్రభుత్వం వైద్యవిద్యను నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేటును ప్రోత్సహించడం దారుణం.

–మునిశేఖర్, నీట్ విద్యార్థి తండ్రి, బీఎన్‌కండ్రిగ



మెడికల్ సీటు మరింత భారం



నీట్ రాసి వైద్యవిద్య చదవాలన్నది అందరికీ కల. వైద్య కళాశాలలో సీటు సాధించాలన్న తపనతో మా అబ్బాయితో నీట్ పరీక్ష రాయించా. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మెరిట్ విద్యార్థులకు వైద్యవిద్య మరింత భారం కావడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరమైతే రూ.కోట్లు ఖర్చు పెట్టి చదివించే స్తోమత మాకు లేదు. కూటమి ప్రభుత్వం వెంటనే చీకటి జీఓలను రద్దు చేసి, మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయకుండా ఆపాలి. ప్రభుత్వం ఆధ్వర్యంలో కళాశాలలను కొనసాగించి, సీట్లు పెంచడానికి కృషి చేస్తే బాగుంటుంది. అప్పుడే మా లాంటి పేదల కల నెరవేరుతుంది.

–తిరుపాల్, విద్యార్థి తండ్రి, బీఎన్‌కండ్రిగ మండలం

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- గరుడ సేవ రోజు తిరుమలలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ఆర్టీసీ రవాణా
- సమీక్షించిన ఈఓ శ్యామలరావు


బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఈఓ శ్యామలరావు

తిరుపతి(అలిపిరి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పటిష్టంగా ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈఓ జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం సమావేశ మందిరంలో గురువారం ఈఓ జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు, ఇతర శాఖలతో సమీక్షించారు. అలిపిరి లింక్ బస్టాండ్, మున్సిపల్ గ్రౌండ్స్, వినాయక నగర్ క్వార్టర్స్‌లో ద్విచక్ర వాహనాలు, భారతీయ విద్యా భవన్ స్కూల్‌లో ప్రైవేట్ జీపులు, కార్లు సహా అన్ని నాలుగు చక్రాల వాహనాలు, ఎస్వీ జూ పక్కనే ఉన్న దేవలోక్‌లో ప్రైవేట్ బస్సుల కోసం పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారులు తప్పిపోకుండా చైల్డ్ ట్యాగింగ్, లగేజీ సెంటర్‌ను ప్రస్తుతం ఉన్న కామన్ కమాండ్ సెంటర్ పాయింట్ నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు సేవాసదన్–1, 2 ఎదురుగా మార్చడం, అన్నప్రసాదం పంపిణీతో పాటు అన్నప్రసాదాన్ని గ్యాలరీలకు తరలించే వాహనాల రూట్ మ్యాప్ రూపొందించడంతో సహా ఇతర ముఖ్యమైన అంశాలను చర్చించారు. స్విమ్స్, రుయా, బర్డ్ నుంచి అదనపు వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని నియమించడం, తిరుమలలో మెరుగైన పారిశుద్ధ్య పనులు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ సమన్వయంతో తిరుపతిలోనూ పారిశుద్ధ్య పనుల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. సమావేశంలో అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్ఓ శ్రీధర్, టీటీడీలోని వివిధ విభాగాల అధిపతులు, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, ఏపీఎస్ ఆర్టీసీ ఆర్ఎం చెంగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత ప్రేరణే విజయ రహస్యం

తిరుపతి సిటీ: విద్యార్థి దశ కీలకమైందని, అంతర్గత ప్రేరణే విజయానికి రహస్యమని వేలూరు జిల్లా అటవీ శాఖాధికారి డాక్టర్ గురుస్వామి పిలుపునిచ్చారు. ఎస్వీ వెటర్నరీ కళాశాలలో గురువారం 61వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ తాను ఇదే కళాశాలలో చదివి ఈ స్థాయికి ఎదిగానని, విద్యార్థులు తమ అకడమిక్ విద్యతో పాటు పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. పట్టుదల, శ్రమ ఆయుధాలుగా చేసుకుని లక్ష్యసాధన కోసం కృషి చేయాలన్నారు. కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఎంతో మంది ఉన్నత స్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనే స్థాయిలో ప్రతి విద్యార్థీ కష్టపడాలంటే అంతర్గత ప్రేరణ అవసరమన్నారు. వీసీ డాక్టర్ జేవీ రమణ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, నిపుణులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారన్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు తాము ఎంపిక చేసుకున్న రంగంలో రాణించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య కళాశాల వ్యవహారాలకు సంబంధించిన వార్షిక నివేదికను సభకు తెలియజేశారు. కళాశాల దినోత్సవం సందర్భంగా జరిగిన క్రీడలు, సాంస్కృతిక పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక, కళా నృత్యాలు వీక్షకులను అలరించాయి. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ వీరబ్రహ్మం పాల్గొన్నారు.

2047 విజన్ డాక్యుమెంట్స్ సిద్ధం చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్స్‌ను మండల, మున్సిపల్, జిల్లా స్థాయిలో గడువు లోపు ప్రణాళికలు సిద్ధం చేసి, ఇవ్వాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వర్చువల్ విధానంలో కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో పెంచల కిషోర్‌తో కలసి జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రోజూ జిల్లాలోని తిరుమల, శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రాలను 75 వేల మంది భక్తులు, ఇతర పర్యాటక ప్రాంతాలను 50 వేల మంది సందర్శిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఫారెస్ట్, జూపార్క్, బీచ్‌లు ఉన్న నేపథ్యంలో పర్యాటకులు రెండు, మూడు రోజుల పాటు జిల్లాలో ఉండడానికి వీలుగా సౌకర్యాలు కల్పించడం ద్వారా పలువురికి ఉపాధి, ఉద్యోగాలతోపాటు ఆదాయాన్ని సమకూర్చుకోవడానికి వీలుంటుందని చెప్పారు. అలాగే శ్రీసిటీతోపాటు పలు పరిశ్రమలు ఉన్న నేపథ్యంలో ప్రగతికి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో స్వర్ణాంధ్ర 2024 విజన్ డాక్యుమెంట్స్, కేంద్రానికి చెందిన వికసిత్ భారత్ 2047లో భాగంగా మండల, మున్సిపాలిటీ, జిల్లా ప్రణాళికలు 100 రోజులుకు, వార్షిక, ఐదేళ్లకు సిద్ధం చేయాలని ఆదేశించారు. వ్యవసాయ వాటి అనుబంధశాఖలతోపాటు పర్యాటక, పరిశ్రమలు, విద్య, వైద్య విభాగాలకు చెందిన అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. మండల, మున్సిపాలిటి ప్రణాళికలు సెప్టెంబర్ 30కి, జిల్లా ప్రణాళికలు అక్టోబర్ 15కి సిద్ధం చేయాలని ఆదేశించారు. విజన్ డాక్యుమెంట్స్ తయారీకి సీపీఓ కోఆర్డినేటర్‌గా ఉంటారని తెలిపారు. ఆయా విభాగాలకు చెందిన జిల్లా అధికారులు నోడల్ ఆఫీసర్లుగా ఉంటారని, మండల స్థాయిలో మండల అధికారులు చూడాల్సి ఉంటుందని చెప్పారు. మరోవైపు బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రభుత్వ కార్యాలయాల్లో క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తామని, దాన్ని స్కాన్ చేసి అభివృద్ధికి సంబంధించి తమ అభిప్రాయాలను తెలియజేయాలని చెప్పారు.

చెన్నైకి కండలేరు జలాల విడుదల


నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, ఎస్ఈ

రాపూరు: కండలేరు జలాశయం నుంచి గురువారం చెన్నై నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు కండలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, తెలుగుగంగ ఎస్ఈ రమణారెడ్డి తెలిపారు. కండలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద ఉన్న పవర్‌ప్లాంట్ యూనిట్ నుంచి చెన్నై నగరానికి నీటిని విడుదల చేశారు. ముందుగా గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, నీటి స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కండలేరు జలాశయాన్ని పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేస్తామన్నారు. ఈ సారి అన్ని అనుకూలిస్తే 56 టీఎంసీల వరకు నీటిని నిల్వ చేస్తామన్నారు. తిరుపతి, నెల్లూరు జిల్లా ప్రజలు, రైతులకు తాగు, సాగు నీటిని అందిస్తామన్నారు. మొదటగా 500 క్యూసెక్కుల నీటిని చెన్నై నగర ప్రజల దాహార్తి తీర్చేందుకు గురువారం విడుదల చేశామని, శుక్రవారం 1200 క్యూసెక్కులకు పెంచుతామన్నారు. అధికారులు ఆదేశాలు వచ్చేంత వరకు నీటిని పెంచుతూ విడుదల చేస్తామన్నారు. ప్రస్తుతం తిరుపతి నగరానికి 200 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 15.753 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. సోమశిల జలాశయం నుంచి 8,300 క్యూసెక్కులు నీరు జలాశయానికి చేరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలాశయం ఈఈ విజయకుమార్ రెడ్డి, డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుమలయ్య పాల్గొన్నారు.

ఇసుక లారీలు సీజ్

వరదయ్యపాళెం: తమిళనాడుకు అక్రమంగా తరలిపోతున్న ఇసుక లారీలను శ్రీసిటీ పోలీసులు సీజ్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు సూచనలతో సీఐ బీవీ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్, సిబ్బందితో కలిసి రాచకండ్రిగ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో తమిళనాడుకు ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు లారీలను అదుపులోకి తీసుకుని సీజ్ చేశారు. వాహనాలను నడుపుతున్న డ్రైవర్లను, యాజమానులపై కూడా కేసులు నమోదు చేశారు. డ్రైవర్లు పోలీసుల అదుపులో ఉన్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓ బదిలీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఇన్‌చార్జి ఈఓ, తిరుపతి ఆర్జేసీ ఎస్‌వీఎస్ఎస్ మూర్తి ద్వారకా తిరుమలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు దేవాదాయశాఖ నుంచి బదిలీ ఉత్తర్వులు గురువారం వెలువడ్డాయి. ఆయన స్థానంలో అన్నవరంలో ఈఓగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ ఆజాద్‌ను తిరుపతి ఆర్జేసీగా నియమించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఇన్‌చార్జిగా చంద్రశేఖర్ ఆజాద్ కొనసాగనున్నారు.

తిరుమలలో అదనపు ఈఓ తనిఖీలు

తిరుమల: టీటీడీ అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి గురువారం వైకుంఠం కంపార్ట్‌మెంట్లు, కూల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా యాత్రికులకు వివిధ సమయాల్లో అందజేస్తున్న అన్నప్రసాదాలు, తాగునీరు, పాలు అందించే నిర్దేశిత సమయాలను పరిశీలించారు. అలాగే కంపార్ట్‌మెంట్ల విడుదల సమయాన్ని పరిశీలించారు. ఈ తనిఖీల్లో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, వీజీఓ సురేంద్ర, ఏఈఓలు శ్రీహరి, మునిరత్నం, ఏవీఎస్ఓ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాల ఢీ: ఏడుగురికి గాయాలు

నాగలాపురం : ఐషర్, తవేరా వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఏడుగురికి తీవ్ర గాయలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని పిచ్చాటూరు– నాగలాపురం జాతీయరహదారి నీరువాయి గ్రామం వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. సత్యవేడు మండలం కదిరివేడు గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు తవేరా వాహనంలో సొంత పనుల నిమిత్తం తిరుపతికి వెళ్లి, తిరిగి ఇంటికి వస్తుండగా నీరువాయి గ్రామం వద్ద ఊత్తుకోట నుంచి పుత్తూరు వైపు ఎదురుగా వస్తున్న ఐషర్ వాహనం వేగం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని 108 వాహనంలో పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నలుగురు స్వల్పంగా గాయపడగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తులను టార్గెట్ చేసే దొంగల అరెస్టు

- రూ.లక్షలు విలువ చేసే 70 గ్రాముల బంగారం స్వాధీనం
- క్రైమ్ ఏఎస్పీ నాగభూషణరావు


చోరులను అరెస్టు చూపుతున్న క్రైమ్ ఏఎస్పీ నాగభూషణరావు

తిరుపతి క్రైమ్: తిరుమల, తిరుపతికి వచ్చే భక్తులను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు క్రైమ్ ఏఎస్పీ నాగభూషణరావు తెలిపారు. గురువారం క్రైమ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన భగవతి శారద(32), ఆర్ ప్రియా(32) ముఠాగా ఏర్పడి తిరుమల, తిరుపతి, తిరుచానూరు, రద్దీగా ఉన్న విష్ణు నివాసం, శ్రీనివాసం ప్రాంతాలను ఎంచుకున్నారు. అంతేకాకుండా ఉచిత బస్సు ఎక్కే సమయంలో బంగారం బ్యాగుతో ఉన్న భక్తులను టార్గెట్ చేసుకుని రెక్కీ నిర్వహిస్తారు. బ్యాగులో బంగారం ఉందని తెలుసుకున్న వెంటనే వారికి తెలియకుండానే బ్యాగును కాజేసి, పరారవుతారు. సుమారు ఏడేళ్లుగా వీరు ఇలాగే చోరీలకు పాల్పడుతున్నారు. శారద యుక్త వయసు నుంచే సహచర చోరులైన భవానీ, వేళాంగిణి, అరవల్లి, తాజాగా ప్రియాతో కలిసి చోరీలకు పాల్పడ్డారు. గతంలో వీరు పలు కేసుల్లో చోరీల్లో చేసి, శిక్ష అనుభవించారన్నారు. వీరిని టీటీడీ విష్ణు నివాసం సమీపంలోని టీపీఎం స్కూల్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.6 లక్షలు విలువ చేసే 70 గ్రాములు బంగారం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసును ఛేదించడంలో డీఎస్పీ రమణకుమార్, సీఐ అబ్బన్న ఎంతగానో కృషి చేశారన్నారు. రికవరీ చేసిన సొత్తు ఐదు కేసులకు సంబంధించిందిగా గుర్తించామన్నారు. త్వరలో వారందరికీ కోర్టు ద్వారా అప్పగిస్తామని తెలిపారు.

క్విజ్ పోటీల్లో తిరుపతి విద్యార్థినుల ప్రతిభ


క్విజ్ పోటీల్లో సర్టిఫికెట్లు పొందిన జిల్లా విద్యార్థులు

తిరుపతి అర్బన్: విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎయిడ్స్ అండ్ హెచ్ఐవీ క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు సర్టిఫికెట్లు పొందారని డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి గురువారం తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి వి.శేఖర్ నేతృత్వంలో జిల్లా నుంచి పదో తరగతి విద్యార్థినులు ఎస్.చెంచమ్మ, బి.రాధిక, తొమ్మిదో తరగతికి చెందిన ఎం.శశి ప్రియదర్శి ఎంపిక చేశారని తెలిపారు. వారు బుధవారం విజయవాడలో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల, యునిసెఫ్ ప్రతినిధి శ్రీలత చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించారు.

ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

గూడూరురూరల్: ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం గూడూరు సమీపంలోని చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ కథనం మేరకు.. తాళ్లమ్మ గుడి సమీపంలోని ఓ రైతు కు చెందిన పొలాల వద్ద ఉంటూ రైతుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసే మస్తాన్ (65) మృతి చెంది ఉన్నట్లు సమాచారం వచ్చింది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి, పరిశీలించగా అతడి కాళ్ల వద్ద పురుగుల మందు డబ్బా ఉండడంతో విషం తాగి మృతి చెంది ఉండవచ్చని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు పొదలకూరుకు చెందిన వ్యక్తి అని తెలిపారు.